సొదుం జయరాం కథలు

**28**

# నీటి మీద తేట

రైలుకు ఇంకా గంటన్నర వ్యవధి ఉంది. అక్కడ నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిదనిపించింది.

అనవసరంగా మనసు పాడుచేసుకున్నాడు. వరుసగా రెండు రాత్రిళ్ళ నుంచి ఆమెను గురించి ఆలోచిస్తూ నిద్రపాడుచేసుకున్నాడు. ఏ పన్నెండింటికో, ఒంటి గంటకో నిద్రపడితే ఆ నిద్రలో కూడా ఆమెను గురించిన కలలు.

చిత్రమేమిటంటే ఆమెను గురించి తనకు ఏమీ తెలీదు. డాక్టరింటికి ఎదురింట్లో ఉంటున్నది ఆమె. మూడు రోజులనాడు తను వరండాలో కూచుని పేపరు చూస్తున్నాడు. ఆమె డోర్ కర్టెన్ పక్కకి తొలగించుకొని వచ్చి వాకిట్లో నిలబడ్డది. సన్నగా, ఎర్రగా, పెద్ద పెద్ద కళ్ళతో చూడముచ్చటగా ఉన్నది. ఆమె తన్ను గమనించినట్టులేదు. ఏదో పోగొట్టుకున్న దానికిమల్లే బజారుకేసి చూస్తోంది. పేపరు చూడటం మాని ఆమెకేసి చూస్తూ కూచున్నాడు తను. ఆవిడ చాలాసేపు అలాగే నిలబడి ఉంది. తర్వాత లోపలికి వెళ్ళి దభీమని తలుపు వేసుకుంది.

ఆ అమ్మాయి అలా ఇంట్లోకి వెళ్ళిన తర్వాత కూడా విశ్వనాథంగారు అలాగే చాలాసేపు ఆ ఇంటికేసి చూస్తూ కూచున్నారు. ఆ ఇంట్లో ఎవరూ ఉన్నట్టు లేదు. బహుశా భార్యా భర్త ఇద్దరే ఉండవచ్చు. భర్త ఆఫీసుకు పొయ్యాడేమో అనుకున్నాడు.

ఆ అమ్మాయిని చూచిన తర్వాత, ఆ అమ్మాయి భర్తను గురించి ఊహించకుండా ఉండలేకపోయాడు.

విశ్వనాధం వూహలో చక్కటి అబ్బాయి మెదిలాడు. ఎర్రగా నొక్కులజుత్తు, కంటికి రిమ్‌లెస్ - అన్నివిధాలా ఆ అమ్మాయికి తగిన భర్త!

తృప్తిగా కళ్ళు మూసుకున్నాడు.

మరి నిజంగా ఆ అమ్మాయిది అన్నివిధాలా అనుకూల దాంపత్యమైతే ఆ కళ్ళల్లో దిగులేమిటి? ఏదో పోగొట్టుకున్న దానికిమల్లే అలా చూస్తూ నిలబడ్డదెందుకు? లేదు – ఆ అమ్మాయి జీవితంలో ఏదో పోగొట్టుకున్నది. బాధపడుతున్నది.

ఆ అమ్మాయి భర్తను చూస్తే కొన్ని విషయాలు వూహించవచ్చు. ఆ అమ్మాయి భర్త తను ఊహించినట్టు, అందమైన వాడైనా, ఆ అమ్మాయి పట్ల అతనికి ప్రేమ లేకపోవచ్చు. ఆ అమ్మాయి అంటే లక్ష్యం లేకపోవచ్చు. లేదా బొత్తిగా రసికత్వంలేని చవట కావచ్చు. ఏదో ఉన్నది. అది తెలుసుకోవాలన్న జిజ్ఞాస అంతకంతకూ విశ్వనాధంగారిలో బలపడసాగింది.

విశ్వనాధంగారు మళ్ళీ నాలుగింటికి వరండాలో కూచున్నాడు. అట్లా కూర్చోవడంలో, విశ్వనాధంగారి ఉద్దేశ్యం ఆ అమ్మాయిని చూడాలని.

వేటగానికి మల్లే ఆరుగంటల వరకు అలాగే కాపువేసి కూచున్నాడు. సరిగ్గా ఆరింటికి ఒక వ్యక్తి వచ్చి తలుపు తట్టడం చూచాడు. ఎక్కడలేని జుగుప్సా కలిగింది. తను ఊహించిన లక్షణాలు ఏ ఒక్కటీ అతనిలో లేవు. అతనికి వయసు మళ్ళింది. వార్ధక్య చిహ్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మనిషి నల్లగా, పీలగా, పీనుగుమల్లే ఉన్నాడు.

ఆ అమ్మాయి జీవితంలో యేం పోగొట్టుకుందో కళ్ళముందు స్పష్టంగా కనిపించింది. ఆ అమ్మాయిమీద విపరీతమైన జాలి పుట్టుకొచ్చింది.

విశ్వనాధానికి ఆ రోజు రాత్రి అన్నం రుచించలేదు. మనసంతా అస్తవ్యస్తమైపోయింది.

రాత్రి పడుకుంటే పక్క కుదరలేదు. నిద్రరాలేదు. ఆ అమ్మాయిని గురించిన ఆలోచనలే. ఏ పన్నెండింటికో కాస్త కలతనిద్ర పట్టింది. రకరకాల కలలు వచ్చాయి. ఆ అమ్మాయి బట్టలమీద కిరసనాయిలు పోసుకొని నిప్పంటించుకున్నది. ఇంట్లోనుంచి మంటలు - పొగలు, ఇంటిచుట్టూ జనం పోగయ్యారు. గునపాలతో తలుపులు పగులగొడుతున్నారు!

విశ్వనాధం కెవ్వున కేకవేసి కూర్చున్నాడు. తర్వాత నిద్రపట్టలేదు. వెళ్ళి కిటికీ తెరచి ఆ ఇంటివైపు చూచాడు. గ్లాస్ విండోస్ గుండా పచ్చటి బెడ్‌రూమ్ లైట్ కాంతి కనిపిస్తోంది. కిటికీ చువ్వలు పట్టుకొని అట్లాటే ఆ ఇంటివైపు చూస్తూ నిలుచున్నాడు.

ఉదయం ఎనిమిదింటికి ఆమె మళ్ళీ గడపలో నిల్చుంది. తెల్లటి చీర - తెల్లటి రవికా-రాయంచలా గుమ్మంలో నిల్చుంది. రోడ్డుమీద పోయే జనాన్ని, కార్లని, బస్సుల్ని చూస్తున్నది. ఒకటి రెండుసార్లు విశ్వనాధం వైపు చూసింది.

విశ్వనాధానికి అక్కడ ఉండటం ముళ్ళమీద ఉన్నట్టుంది. గబగబా బెడ్డింగు సర్దాడు. ఇంతలో కాఫీ వస్తే, అది కూడా ముగించి డాక్టరుతోనూ-ఆయన భార్య సుశీలతోనూ సెలవు తీసుకుందామని – గబగబా మెట్లుదిగి కిందికి వచ్చాడు.

మండువాలో సుశీల ఎవరితోనే మాట్లాడుతోంది. ఆ మాటలు తనకు సంబంధించినవి. విశ్వనాథం లోపలికి వెళ్ళకుండా గడపలోనే తచ్చాడుతూ నిలుచున్నాడు. మాటలు స్పష్టంగా వినిపిస్తున్నవి.

'ఆయన విశ్వనాథంగారని మా వారికి ఫ్రండు, ఏదో పనిమీద వచ్చాడు. ఇవ్వాళో రేపో వెళతారు' అంటున్నది సుశీల.

అవతలి వ్యక్తి సన్నగా నవ్వడం వినిపించింది. తర్వాత 'ఎవరో పేషంటనుకున్నాను. మూడు రోజుల నుంచి చూస్తున్నాను. వరండాలో కూచొని బజారుకేసి దిగులుగా చూస్తుంటాడు. టి.బి. లాంటి వ్యాధేమో, ప్రాణభయం గామాలు అనుకున్నాను. అయితే డాక్టరుగారి ఫ్రండన్నమాట. ఏమిటో ఒకోసారి పిచ్చిగా ఆలోచిస్తాము. ఆ ఆలోచనలకు అర్థం పర్థం ఉండదు.'

విశ్వనాథానికి తల గిర్రున తిరుగుతున్నట్లయింది. లోపలికి తొంగి చూశాడు. ఆ అమ్మాయి!

లోపలికి వెళ్ళడమా, మానడమా అన్న సందిగ్ధంలో పడ్డాడు. వెనక్కు తిరుగుతున్నాడు.

'ఎవరూ? విశ్వనాథం అన్నగారా? లోపలికి రండి' అన్నది సుశీల. ఎవరో వెనక తోస్తున్నట్టు లోపల అడుగుపెట్టాడు. ఆ అమ్మాయి తనవైపు వింతగా చూస్తూ బయటకు వెళ్ళిపోయింది.

విశ్వనాథంగారికి గొంతు పెగలలేదు. కష్టంమీద 'ఊరికి వెళ్తున్నానమ్మా, చెప్పి పోదామని వచ్చాను' అన్నాడు.

సుశీల కొడుక్కి రిక్షా పిలవమని చెప్పి 'చూశారా అన్నగారూ! ఎదురింటి జానకి మిమ్మల్ని చూచి....'

విశ్వనాథంగారు మధ్యలోనే మాట తుంచుతూ. 'విన్నాను' అన్నాడు పేలవంగా నవ్వి.

జానకి తన్నుగూర్చి అట్లా ఊహించినందుకు వంటిమీద తేళ్ళూ, జెర్రులూ పాకుతున్నట్టుంది. అట్లాంటి స్థితిలోకూడా, విశ్వనాథానికి ఆమెను గూర్చి తెలుసుకోవాలన్న జిజ్ఞాస సడలలేదు.

'ఎవరమ్మా ఆమె?' యధాలాపంగా అడుగుతున్నట్టు అడిగాడు.

'మన ఎదురింట్లో ఉంటున్నారు. ఆ అమ్మాయి భర్త లెక్చరరు. ప్రేమించి పెళ్ళిచేసుకున్నారిద్దరూ' అన్నది సుశీల.

తలమీద సుత్తితో కొట్టినట్టు అదిరిపడ్డాడు విశ్వనాథం. 'వస్తానమ్మా' అంటూ వెళ్ళి రిక్షాలో కూర్చున్నాడు. ప్రక్క రూములోవున్న డాక్టరుతో చెప్పి వెళ్ళాలన్న విషయం కూడా స్ఫురించలేదు ఆయనకి ఆ క్షణాన.

- (1966 మార్చి జ్యోతి మాసపత్రిక)